ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు


శుక్రవారం 5 డిసెంబరు 2025



నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు రాక

- భామినిలో నిర్వహించే పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి హాజరు
- పాల్గొననున్న మంత్రి లోకేశ్
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

8లో





కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్

గ్రూపులు వద్దు.. కలిసికట్టుగా పనిచేయండి

- టీడీపీలో వ్యక్తులు శాశ్వతం కాదు
- 2029లో మళ్లీ అధికారంలోకి రావాలి
- కరడుగట్టిన కార్యకర్తలే నాకు స్ఫూర్తి
- క్యాడర్‌కు మంత్రి నారా లోకేశ్ దిశానిర్దేశం



సమావేశంలో పాల్గొన్న మంత్రులు అచ్చెన్నాయుడు, సంధ్యారాణి, ఎమ్మెల్యేలు విజయచంద్ర, జగదీశ్వరి తదితరులు



వినతులు తీసుకుంటూ..

పార్వతీపురం/భామిని/సీతంపేట రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి)


'అలకలు వీడి పార్టీ కోసం ప్రతీ ఒక్క కార్యకర్త పనిచేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి. 2029 ఎన్నికల్లో మళ్లీ కూటమి అధికారంలోకి వచ్చేందుకు కష్టపడి పనిచేయాలి. గ్రూపు రాజకీయాలు వద్దు. అందరూ కలిసికట్టుగా పనిచేయాలి' అని విద్యాశాఖ, ఐటీశాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. ఈ మేరకు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. భామిని మండలం లివిరి జంక్షన్ వద్ద గురువారం రాత్రి పాలకొండ నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గత వైసీపీ ప్రభుతంలో ఉత్తరాంధ్రను వెనుకబడిన ప్రాంతంగా పిలిచేవారు. అభివృద్ధి లేని జిల్లాలుగా గత పాలకులు ఈ ప్రాంతాన్ని తయారుచేశారు. నేడు కూటమి ప్రభుత్వ హయాంలో ఏపీకే ఉత్తరాంధ్ర వెన్నెముకగా నిలుస్తోంది. ఉత్తరాంధ్రకు రూ.లక్షల కోట్ల పెట్టుబడులను వివిధ సంస్థల నుంచి తెప్పిస్తున్నాం. కూటమిని అధికారంలోకి తీసుకురావడానికి కార్యకర్తలు చేసిన కృషి మరువలేనిది. టీడీపీలో వ్యక్తులు కాదు పార్టీయే శాశ్వతం. పార్టీ అధినేత చంద్రబాబుతో పాటు నేను ఎక్కడకు వెళ్లినా కార్యకర్తలను కలిసిన తరువాతే అధికారిక (మిగతా 8వ పేజీలో..)



అసంపూర్తిగా ఉన్న పూర్ణపాడు-లాబేసు వంతెన


సీఎం సారూ.. ఆశలన్నీ మీపైనే!

- పార్వతీపురం మన్యం జిల్లా... సమస్యల ఖిల్లా..
- సాగు, తాగునీటికి ఇక్కట్లు.. పూర్తికాని ప్రాజెక్టుల పనులు
- వైద్య సేవల కోసం పొరుగు జిల్లాలకు పరుగు
- ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు కరువు
- ఎన్నికల అనంతరం తొలిసారిగా జిల్లాకు ముఖ్యమంత్రి చంద్రబాబు రాక



పార్వతీపురం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ప్రచారం అనంతరం మొట్టమొదటిసారిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాలో అడుగుపెడుతున్నారు. శుక్రవారం భామిని ఆదర్శ పాఠశాలలో నిర్వహించనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో పాల్గొనున్నారు. ఈనేపథ్యంలో సీఎంకు అనేక సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి.

వెనుకబడిన జిల్లాగా గుర్తింపు పొందిన పార్వతీపురం మన్యం.. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో కనీస అభివృద్ధికి నోచుకోలేదు. సాగు, తాగునీటికి ప్రజలు, రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. రోడ్లు, కాలువలు ఇతర మౌలిక వసతుల్లేక తీవ్ర ఇక్కట్లపాలవుతున్నారు. పారిశ్రామిక పురోగతి లేక జిల్లా నుంచి ఎంతోమంది వలసబాట పడుతున్నారు. ఇక్కడి వారికి మెరుగైన వైద్య సేవలు కూడా అందడం లేదు. మరోవైపు ఏనుగుల బెడద జిల్లావాసులను వేధిస్తోంది. వీటిపై ముఖ్యమంత్రి దృష్టి సారించి సమస్యలకు పరిష్కార (మిగతా 8వ పేజీలో..)



జంఝావతి ప్రాజెక్టు

రోగులు ఫుల్.. సేవలు నిల్

- సమస్యల వలయంలో జిల్లా కేంద్రాసుపత్రి
- వేధిస్తున్న వైద్యుల కొరత
- రోగులకు తప్పని ఇబ్బందులు



జిల్లా కేంద్ర ఆసుపత్రి

పార్వతీపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పేరుకే అది జిల్లా కేంద్ర ఆసుపత్రి. కానీ, సేవలు మాత్రం ఆ స్థాయిలో అందడం లేదు. జిల్లా కేంద్రం ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ మౌలిక వసతులు మాత్రం పెరగలేదు. దీంతో రోగులు ఎక్కువ.. సేవలు తక్కువ అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రికి ప్రతిరోజూ కనీసం 300 మందికి తగ్గకుండా రోగులు వస్తుంటారు. ఇన్‌పేషెంట్లుగా 150 మంది ఆస్పత్రిలో చేరుతుంటారు. ఒక్కోసారి ఈ సంఖ్య 250 వరకు ఉంటుంది. ఆస్పత్రిలో 150 పడకలు మాత్రమే ఉండడంతో అవి సరిపోక అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. వైద్యులు, సిబ్బంది పూర్తిస్థాయిలో లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. రేడియాలజిస్ట్ పోస్టు రెండేళ్ల నుంచి ఖాళీగా ఉన్నా భర్తీ కావడం లేదు. దీంతో స్కానింగ్ కోసం రోగులకు పాట్లు తప్పడం లేదు. నర్సింగ్ సూపరింటెండెంట్ ఆసుపత్రికి ఎంతో అవసరం. కానీ, ఆ పోస్టు కొన్ని సంవత్సరాలుగా ఖాళీగా ఉన్నప్పటికీ పట్టించుకొనే నాథుడు లేడు. హెడ్‌నర్సుల సంఖ్య కూడా రోగులకు తగ్గట్టుగా లేదు. ఐసీయూ విభాగంలో అవసరమైన వైద్యులతో పాటు వైద్య సిబ్బంది ఉండాలి. ఇక్కడకూడా పూర్తిస్థాయిలో లేరు. ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న వైద్యులే ఐసీయూలో సేవలు అందించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఆస్పత్రిలో ఐసీయూ కేంద్రాన్ని ప్రారంభించారు. కానీ, అవసరమైన వైద్యులను, సిబ్బందిని నియమించుకోలేని స్థితిలో వైద్యవిధాన పరిషత్ ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్ఎంవో పోస్టు సైతం ఖాళీగా ఉంది. ఆర్ఎంవోగా డాక్టర్ శ్యామల ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అదేవిధంగా మైక్రో బయాలజీ విభాగంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టు ఖాళీగా ఉంది. ఇప్పటికైనా పోస్టులన్నీ భర్తీ చేసి మెరుగైన సేవలు అందించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

గిరిజనులతో రాజకీయాలు తగదు

- మంత్రి సంధ్యారాణి

8లో









ఘంటసాలకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

ఘంటసాలకు ఘన నివాళి

- నేడు 12 గంటల పాటు నిర్విరామ స్వరాభిషేకం
- విజయనగరం జిల్లాకు తొలిసారిగా వస్తున్న డ్రమ్స్ శివమణి

విజయనగరం కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల 103వ జయంతి వేడుకలు గురువారం ప్రారంభ మయ్యాయి. ఘంటసాల స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో స్థానిక గుమ్చీ కూడలిలో ఘంటసాల విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. కళాపీఠం వ్యవస్థాపకుడు భీష్మారావు, అధ్యక్షుడు దుర్వాసుల రాజేంద్రప్రసాద్, ఘంటసాల అభిమాని సూర్యలక్ష్మి, సూర్యనారాయణ తదితరులు శివాలయంలో ఘంటసాల పేరున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిరుపేదలకు తువ్వాళ్లు అందజేశారు. కాగా ఆనందగజపతి కళాక్షేత్రంలో 12 గంటల పాటు నిర్విరామ ఘంటసాల సంగీత విభావరిని శుక్రవారం నిర్వహించనున్నారు. ఘంటసాల ఆలపించిన పాటలతో పాటు ఘంటసాల దర్శకత్వం వహించిన చిత్రాల్లోని పాటలను గాయనీ, గాయకులు ఆలపించనున్నారు. మూడు జిల్లాల నుంచి 23 మంది గాయనీగాయకులతో పాటు భీష్మా సంగీత ఇనిస్టిట్యూట్‌కు చెందిన గాయనీ, గాయకులు వారితో గొంతు కలపనున్నారు.

- ఆనందగజపతి కళాక్షేత్రం వేదికగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పద్మశ్రీ డాక్టరు పెర్కషన్ మాస్ట్రో శివమణికి ఘంటసాల స్మారక పురస్కారాన్ని అందించేందుకు ఘంటసాల స్మారక కళాపీఠం ఏర్పాట్లు చేసింది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు శివమణి ఆనందగజపతి కళాక్షేత్రానికి రానున్నారు. ఆయన జిల్లాకు తొలిసారిగా వస్తుండంతో అధిక సంఖ్యలో సంగీతాభిమానులు కళాక్షేత్రానికి తరలిరానున్నారు.

వసతులు లేని గృహాలు

- పూర్తిస్థాయిలో అందని దుప్పట్లు
- చలికి వణుకుతున్న విద్యార్థులు
- అనేకచోట్ల వేధిస్తున్న మరుగుదొడ్ల సమస్య

6లో

స్థానిక సంస్థల బలోపేతమే లక్ష్యం

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- వర్చువల్‌గా డీడీవో కార్యాలయాలు ప్రారంభం

6లో

తోటపల్లి నుంచి సాగునీరు నిలుపుదల

6లో





వసతులు లేని గృహాలు

ఉమ్మడి జిల్లాలోని బీసీ, ఎస్సీ వసతి గృహాల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అత్యధిక శాతం హాస్టళ్లు అద్దె భవనాల్లో నడుస్తుండడంతో మరుగుదొడ్లు, స్నానాల గదుల సమస్య వేధిస్తోంది. అనేక వసతి గృహాలు ఇన్‌చార్జులతోనే నడుస్తున్నాయి. దీంతో పర్యవేక్షణ కరువవుతోంది.

- పూర్తిస్థాయిలో అందని దుప్పట్లు
- చలికి వణుకుతున్న విద్యార్థులు
- అనేకచోట్ల వేధిస్తున్న మరుగుదొడ్ల సమస్య

ఆంధ్రజ్యోతి పరిశీలన


దాసన్నపేట కళాశాల బాలుర వసతిగృహంపై స్నానాలు చేసే స్థలం


బైపాస్ కాలనీలో గల వసతి గృహంలో..

పారిశుధ్య లోపంతో అవస్థలు..

పార్వతీపురం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక బైపాస్ కాలనీలో గల బాలుర వసతి గృహంలో రీడింగ్ రూమ్ లేకపోవడంతో చలిని తట్టుకుంటూ వసతి గృహానికి ఆనుకొని ఉన్న ఒక గదిలో చదవాల్సి వస్తోంది. అక్కడ సురక్షిత మంచినీరు లేదు. మంచాలను విద్యార్థులు వినియోగించడం లేదు. పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ఇందిరా కాలనీలో గల ప్రభుత్వ కళాశాలల బాలుర వసతి గృహంలో మంచాలు లేకపోవడంతో గజ గజ వణికించే చలిలో నేలపైనే నిద్రిస్తున్నారు. కిటికీలకు నాసిరకం మెస్‌లు ఏర్పాటు చేయడంతో దోమలతో పాటు చల్లటి గాలులు ఇబ్బంది పెడుతున్నాయి. విద్యార్థులకు సరిపడా బెడ్ షీట్స్ లేవు.

కటిక నేలపైనే నిద్ర..


కటిక నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు

సాలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహంలో ప్రస్తుతం 220 మంది విద్యార్థులు ఉంటున్నారు. వీరి గదులకు గల కిటికీలకు దోమలు రాకుండా మెస్‌లు ఉన్నాయి. కానీ మంచాలు లేకపోవడంతో కటిక నేలపైనే నిద్రపోవాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వసతి గృహంలో పూర్తి స్థాయిలో గదులు లేకపోవడంతో అవస్థలు పడాల్సి వస్తోందని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వసతి గృహ ఆవరణలో నిర్మించిన అదనపు గదులు ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి తక్షణం అదనపు గదుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

గిరిజన విద్యార్థులకు ఇక్కట్లు..


బాలుర ఆశ్రమ పాఠశాలలో నేలపై దుప్పట్లు పరుచుకొని నిద్రిస్తున్న గిరిజన విద్యార్థులు

సీతంపేట రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఐటీడీఏ పరిధిలో చదు వుతున్న గిరిజన విద్యార్థులు 80శాతానికి పైగా నేలపైనే నిద్రిస్తున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో సుమారు 16వేలకు పైగా గిరిజన విద్యార్థులు ఆశ్రమ, పోస్టుమెట్రిక్ వసతి గృహాలు, గురుకులాల్లో చదువుతున్నారు. వీరికి ఏటా శీతాకాలంలో చలిలో ఇబ్బందులు తప్పడం లేదు. అనేక చోట్ల వసతి సమస్య వేధిస్తోంది.

సమస్యల తిష్ఠ..


వంట గది తలుపులకు గోనె సంచులు కట్టిన దృశ్యం

గరుగుబిల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ వసతి గృహ కిటికీలకు అవసరమైన మెస్‌లు లేవు. దీంతో దోమల బెడదతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుప్పట్లను కొద్ది రోజుల క్రితం విద్యార్థులకు సరఫరా చేశారు. ఓ గదికి తలుపులు లేకపోవడంతో ఉన్న గదిలోనే సర్దుకొని నిద్రించాల్సిన పరిస్థితి ఉంటోంది. తలుపులకు చెక్కలు లేకపోవడంతో గోనె సంచులు కట్టుకున్నారు. రాత్రి సమయంలో అటెండర్లు ఉండడం లేదు. వసతి గృహంలో సుమారు 50 మందికి పైగా విద్యార్థులు ఉంటున్నారు. ఇదిలా ఉండగా... సంబంధిత వసతి గృహ అధికారికి గరుగుబిల్లితో పాటు చినమేరంగి, కురుపాం వసతి గృహాల ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. దీంతో ఎక్కడా పూర్తి స్థాయిలో పర్యవేక్షణ ఉండడం లేదు. తక్కువ మంది విద్యార్థులే రాత్రి సమయాల్లో వసతి గృహంలో ఉంటున్నారు. దీనిపై వసతి గృహ అధికారి ఎన్.శ్రీనివాసరావును వివరణ కోరగా కొంతమంది విద్యార్థులు సొంత ఇళ్లకు వెళ్లారని తెలిపారు. వసతి గృహంలోని సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించినట్టు చెప్పారు.

తరగతి గదులే దిక్కు..


పాచిపెంట గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల

పాచిపెంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన బాలుర సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు చాలీచాలని వసతులతో ఇబ్బందులు పడుతున్నారు. ఆశ్రమ పాఠశాలలో మూడు నుంచి 10వ తరగతి వరకు 243 మంది విద్యార్థులు ఉన్నారు. అక్కడ ఉన్న 11 గదులలో ఆరింటిని తరగతులకు వినియోగిస్తున్నారు. పగలు తరగతులు నిర్వహించే గదుల్లోనే రాత్రి వేళల్లో నిద్రించాల్సి వస్తోంది. డైనింగ్ హాల్, డార్మిటరీలు లేవు. కుక్, వాచ్‌మెన్ పోస్టులు కూడా సంవత్సరాల తరబడి ఖాళీగా ఉన్నాయి. అసౌకర్యాల నడుమ విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు.

ఎన్నో సమస్యలు..


బొబ్బిలి కాలేజీ హాస్టల్ ముందు ఇలా..

బొబ్బిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోస్టు మెట్రిక్ ఎస్సీ బాలుర వసతి గృహంలో సుమారు 102 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ కళాశాల హాస్టల్‌లోనే కాకుండా మిగిలిన ఎస్‌సీ హాస్టళ్ల విద్యార్థులకు ట్రంక్ పెట్టెలు, కంచాలు, ప్లేట్లు, గ్లాసులు, మంచాలు ఇవ్వలేదు. రగ్గులు, దుప్పట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారు. దీంతో వారంతా నేలపైనే నిద్రించాల్సి వస్తోంది. ఒక్కో విద్యార్థికి నెలకు రూ.1600 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. నిర్దేశించిన మెనూకు ఆ డబ్బులు సరిపడడం లేదు. ఇక్కడ ఆర్వో ప్లాంటు ఇచ్చినప్పటికీ అది పనిచేయకపోవడంతో తాగునీటికి కటకటలాడుతున్నారు. ఉన్న ఒక్క బోరుబావి మరమ్మతుకు గురైతే విద్యార్థులకు పాట్లు తప్పడం లేదు. దోమలతో సహవాసం చేయాల్సి వస్తోంది. పట్టణంలో గల గిరిజన కళాశాల బాలుర హాస్టల్‌లో వసతి సౌకర్యాలు మృగ్యం. విద్యార్థులకు సరిపడా నీటి వసతి, స్నానపు గదులు లేవు. కిటికీలు, తలుపులు సక్రమంగా లేవు. దీనిపై విద్యార్థులు మాట్లాడుతూ పోస్టుమెట్రిక్ విద్యార్థులకు మంచాలు, పరుపులు సరఫరా చేయాలని కోరారు.

సమస్యల తిష్ఠ..

రాజాం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లో సమస్యలు వెంటాడుతున్నాయి. విద్యార్థులకు చాలా ఏళ్లుగా కాస్మెటిక్స్ చార్జీలు చెల్లించలేదు. బీసీ బాలుర వసతి గృహం విద్యార్థులకు ఇంతవరకు దుప్పట్లు అందజేయలేదు. ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులకు దుప్పట్లు అందజేసినప్పటికీ కాస్మెటిక్స్ చార్జీలు లేవు. సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి.

మౌలిక సౌకర్యాలు లేవు..


ప్రభుత్వ బాలుర వసతి గృహంలో విద్యార్థులు

గజపతినగరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అద్దె భవనాల్లో ఉన్న వసతులతోనే సర్దుకుపోవలసి వస్తోంది. మెంటాడ రోడ్డులో గల ప్రభుత్వ బాలుర వసతి గృహం అద్దె భవనంలో నడుస్తోంది. ఇందులో 84 మంది విద్యార్థులు ఉంటున్నారు. ప్రభుత్వం నుంచి దుప్పట్లు, మంచాలు, బెడ్‌లు రాకపోవడంతో నేలపైనే నిద్రిస్తున్నారు. ఇంటి నుంచి తెచ్చుకున్న చాపల మీద పడుకుంటున్నారు. దుప్పట్లు, బెడ్లు ఇంటి నుంచే తెచ్చుకుం టున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. సరిపడా మరుగుదొడ్లు లేవు. ప్రతి రోజు మెనూ అమలు చేస్తున్నప్పటికీ మధ్యాహ్న భోజనంతో పెరుగు ఇవ్వడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

అధ్వాన స్థితిలో..

విజయనగరం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అద్దేపల్లివారి వీధిలో ఉన్న ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలుర వసతిగృహం, దాసన్నపేటలో ఉన్న ప్రభుత్వ వెనుకబడిన తరగతుల కళాశాల బాలుర వసతిగృహాలు అధ్వాన స్థితిలో ఉన్నాయి. సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. వీటిలో మంచాలు, పరుపులు లేకపోవడంతో విద్యార్థులు నేలపైనే నిద్రిస్తున్నారు. కనీసం చాపలు కూడా లేవు. దాసన్నపేటలోని కళాశాల బాలుర వసతిగృహంలో మరుగుదొడ్లు, స్నానాల గదులు అధ్వానంగా ఉన్నాయి. మూడో అంతస్థు పైన ఉన్న ట్యాంకు వద్ద స్నానాలు చేస్తున్నారు. వసతిగృహాల్లో సిబ్బంది కొరతతో పాటు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

శిథిలావస్థలో వసతి గృహం..


ఎస్.కోట బీసీ వసతి గృహ కిటికీల తలుపులు ఊడిన దృశ్యం

శృంగవరపుకోట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరుకుంది. శ్లాబు పెచ్చులు ఊడి పడుతుండడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఇటీవల విద్యార్థులకు రెండేసి దుప్పట్లు ఇచ్చింది. మెనూ వంటి వాటిని ప్రభుత్వ సూచనల ప్రకారం అందిస్తున్నప్పటికీ వసతి గృహం పూర్తిగా పాడైంది. కిటికీలు పాడయ్యాయి. శీతలగాలులకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. దోమలు కుడుతున్నాయి. ఇటీవల కొంతవరకు మరమ్మతులు చేపట్టినప్పటికీ శ్లాబ్ పెచ్చులు ఎప్పుడు ఊడిపడతాయోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలలోనే నిర్వహణ..

భోగాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భోగాపురంలోని బీసీ బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరుకోవడంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులందరికీ ఓ గది కేటాయించారు. అందులోనే పెట్టెలు పెట్టుకోవడం, చదువుకోవడం, నిద్రపోవడం చేస్తున్నారు. మరో గదిని వంటశాలగా వినియోగిస్తున్నారు. వసతి గృహంలో ప్రస్తుతం 26 మంది పదో తరగతి విద్యార్థులు ఉంటున్నారు. అందరూ ఒకేచోట ఉండడానికి అవస్థలు పడుతున్నారు. నేలపైనే నిద్రించాల్సి వస్తోంది. స్నానపుగదులు లేవు. హైస్కూల్‌కు చెందిన మరుగుదొడ్లు ఉపయోగించుకొంటున్నారు. ఒకప్పుడు 100 మందికి పైగా విద్యార్థులు ఉండే బీసీ వసతి గృహంలో ప్రస్తుతం 26 మంది మాత్రమే ఉంటున్నారు.


భోగాపురం హైస్కూల్లో ఒకే గదిలో నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు

స్థానిక సంస్థల బలోపేతమే లక్ష్యం

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- వర్చువల్‌గా డీడీవో కార్యాలయం ప్రారంభోత్సవం


బొబ్బిలి రూరల్: కార్యాలయ ప్రారంభ కార్యక్రమంలో డీడీవో కిరణ్‌కుమార్, ఇతర అధికారులు

బొబ్బిలి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) స్థానిక సంస్థలను బలోపేతం చేయడమే లక్ష్యమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. పాలనాపరమైన సంస్కరణల ఫలాలను ప్రజలకు సక్రమంగా అందించే బాధ్యత ఉద్యోగులపై ఉందని ఆయన స్పష్టం చేశారు. గురువారం జగన్నాథపురంలో నూతనంగా నిర్మించిన డీడీవో కార్యాలయాన్ని ఆయన చిత్తూరు నుంచి వర్చువల్‌గా ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమం లో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని వీక్షించా రు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా డీడీవో కార్యాలయాలను ప్రారంభించామన్నారు. పంచాయతీలను స్వతంత్ర యూనిట్లు చేయడం ద్వారా గ్రామీణులకు మెరుగైన సేవలు అందించే వెసులుబాటు తీసుకువచ్చామన్నారు. కార్య క్రమంలో డీడీవో ఎం.కిరణ్‌కుమార్, ఎంపీడీవో పి.రవికుమార్, డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు, ఎంపీపీ శంబంగి లక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు ఎస్.శాంతకుమారి, డీఈఈ వసంత అప్పారావు, ఏఈ రాజశేఖర్, సర్పంచ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే విజయచంద్ర


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా డీడీవో కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం నర్సాపురంలో నూతనంగా నిర్మించిన డివిజనల్ అభివృద్ధి వారి కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాడిన తర్వాత గత ప్రభుత్వ హయాంలో అధికారులు కూర్చోడానికి సరైన వసతులు లేవన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి ప్రతి శాఖకు మౌలిక వసతులతో కూడిన భవన సముదాయాలను ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. అందులో భాగంగానే డీడీవో కార్యాలయాలను ఏర్పాటు చేశారన్నారు. కార్యాలయంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి పూర్తిస్థాయి సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో రమేష్ రామన్, ఎంపీఈవోలు సత్యం, పైడితల్లి, పార్వతి, డిప్యూటీ ఎంపీఈవోలు పాపారావు, గొట్టాపు వెంకటరమణ, గొట్టాపు వెంకటనాయుడు, బోను దేవిచంద్రమౌళి, గురజాన చంద్రమౌళి, బడే గౌరునాయుడు, గణేష్, డాక్టర్ భానుప్రసాద్, కోలా మధు తదితరులున్నారు.



చీపురుపల్లిలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు


పాలకొండ: కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

చీపురుపల్లిలో...

చీపురుపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి డివిజనల్ అభివృద్ధి కార్యాలయాన్ని గురువారం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించారు. పట్టణంలోని మూడో నంబరు సచివాలయ భవనంలో ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఉప సర్పంచ్ బెల్లాన శ్రీదేవి, టీడీపీ నాయకులు కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజు, రౌతు కాము నాయుడు, దన్నాన రామచంద్రుడు, పైల బలరాం, డీడీఓ హేమసుందర్, ఎంపీడీఓ ఐ.సురేష్, తహశీల్దార్ డి.ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే జయకృష్ణ..

పాలకొండ, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జయకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలో డీడీవో కార్యాలయాన్ని ఎమ్మెల్యే, డీఎల్‌డీవో గోపాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పలు ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మాణం చేశామన్నారు. ప్రజలకు సేవలను విస్తృతం చేయాలనే ఉద్దేశంతో కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

విజయనగరంలో...

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయాన్ని గురువారం విజయనగరంలోని కలెక్టరేట్‌లో ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దీన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. దీనికి కలెక్టర్ కార్యాలయం నుంచి హోం మంత్రి వంగలపూడి అనిత, ఎంఎస్‌ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ రామసుందర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

శభాష్ రాంబాబు

- పార్వతీపురం మన్యం జిల్లావాసికి నారా లోకేశ్ ప్రశంస
- ఎలమంచిలి జడ్పీ హైస్కూల్‌లో తెలుగు టీచర్‌గా విధులు
- తెలుగు భాషాభివృద్ధి, పాఠశాల ఉన్నతికి కృషి చేస్తున్నందుకు మంత్రి అభినందనలు


విద్యార్థులకు బోధిస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు రాంబాబు

ఎలమంచిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న ఎలమంచిలి తులసీనగర్‌లోని జడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ తెలుగు స్కూల్ అసిస్టెంట్ ముప్పల రాంబాబును విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ ప్రశంసించారు. తెలుగును బోధిస్తూ, తెలుగు పాఠ్య పుస్తకాలు రచిస్తూ, తెలుగు వికాసానికి పాటుపడుతున్నందుకు అభినందనలు అని నారా లోకేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. దీంతో ఈ పాఠశాల గురించి, ఉపాధ్యాయుడు రాంబాబు గురించి అందరిలో ఆసక్తి నెలకొంది.

పార్వతీపురం మన్యం జిల్లా పెదబొండపల్లికి చెందిన ముప్పల రాంబాబు ఎలమంచిలి జడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లో 2023 సంవత్సరం మే 24న తెలుగు ఉపాధ్యాయునిగా చేరారు. బడినే గుడిగా భావించి ఆయన విద్యాబోధన చేస్తున్నారు. ఎంఏ (తెలుగు), ఎం ఏ (సంస్కృతం) చదివిన ఆయన గతంలో 18 సంవత్సరాల పాటు హైస్కూల్ తెలుగు పాఠ్య పుస్తక రచయితగా అనేక మాడ్యూల్స్ ట్రైబల్ వెల్ఫేర్ అభ్యాసిక, దీపిక పుస్తకాలు రచించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో అర్చక శిక్షణ, శుభప్రదం, ఆలయం అర్చన, పుస్తకాల రచయితగా సుమారు 10 వేల మందికి శిక్షణ ఇచ్చారు. ఉద్యోగ రీత్యా రాష్ట్ర వ్యాప్తంగా స్టేట్ రీసోర్స్ పర్సన్‌గా వేలాది మంది తెలుగు పండిట్‌లకు శిక్షణ ఇచ్చారు. గతంలో అనకాపల్లి సమీపంలోని సీతానగరం పాఠశాలలో పనిచేసిన సమయంలో తోటి ఉపాధ్యాయులు, గ్రామస్థుల సహకారంతో ఆరు వేల పుస్తకాలతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు గ్రంథ పఠనంపై మక్కువ పెంచుకునేలా కృషి చేశారు. పుస్తక పఠనం ప్రాధాన్యం తెలియవచ్చేలా గ్రామంలోని ఆలయాల ఆవరణలో కూడా పుస్తకాలను చదువుకునేందుకు ఏర్పాటు చేసేవారు. ప్రతి విద్యార్థి పుట్టిన రోజున ఒక మంచి పుస్తకం కొనుగోలు చేసుకునేలా వారిలో అభిరుచిని కలిగించారు. ప్రస్తుతం ఎలమంచిలి జడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లో తోటి ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల సంఖ్య పెరిగేలా కృషి చేశారు. హెచ్‌ఎం సుశీల పర్యవేక్షణలో ఉపాధ్యాయులంతా విద్యార్థులు చదువులో, క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నారు. ఈ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి అండర్ 19 ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ క్రమంలో ఉపాధ్యాయుడు రాంబాబును మంత్రి నారా లోకేశ్ ప్రశంసించారు.

ఘనంగా అనఘాదేవి వ్రతం


అనఘాదేవి వ్రతంలో భక్తులు

చీపురుపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని దత్తసాయి మందిరంలో దత్తాత్రేయ సహిత అనఘాదేవి వ్రతాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాకడ హారతి, పంచామృత, క్షీరాభిషేకం, అన్న ప్రసాద వితరణ, పల్లకి ఊరేగింపు, సాయి గానామృతం తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం జరిగిన అనఘాదేవి వ్రతంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అర్చకులు బీహెచ్ మూర్తిశర్మ, వీవీ రవిశర్మలు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త తంగుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి నుంచి సాగునీరు నిలుపుదల

గరుగుబిల్లి, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని కుడి ప్రధాన కాలువ నుంచి సాగునీరు సరఫరాను నిలుపుదల చేశారు. ఖరీఫ్ పనులు పూర్తికావడంతో సాగునీరును నిలుపుదల చేశామని ప్రాజెక్టు జేఈ బి.కిశోర్‌కుమార్ తెలిపారు. రబీకి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సాగునీటిని సరఫరా చేస్తామన్నారు. ప్రధాన కాలువల పరిధిలో మరమ్మతుల పనులు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నామన్నారు. ఇదిలా ఉండగా ఎడమ ప్రధాన కాలువ షట్టరు మరమ్మతులకు గురికావడంతో సాగునీరుప్రవాహం కొనసగుతోంది.

న్యూస్ బాక్స్

నేడు హోంమంత్రి రాక

కొత్తవలస, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత శుక్రవారం మండలానికి రానున్నారు. మధ్యాహ్నం 3గంటలకు మండలంలోని మంగళపాలెం గ్రామంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్టుకు రానున్నట్టు ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్ బాబు తెలిపారు. ట్రస్టులో దివ్యాంగులకు ఆమె ఉపకరణాలు పంపిణీ చేస్తారని చెప్పారు.

డిప్యూటీ ఎంపీడీవోగా పట్నాయక్ బాధ్యతలు

మెరకముడిదాం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల డిప్యూటీ ఎంపీడీవోగా ఎస్‌వీఆర్‌కే పట్నాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన చోడవరం పంచాయతీలో గ్రేడ్-1 కార్యదర్శిగా పనిచేసేసి పదోన్నతిపై డిప్యూటీ ఎంపీడీవోగా మండలానికి వచ్చారు. ముందుగా డిప్యూటీ ఎంపీడీవో గదిని వైస్ ఎంపీపీ టి.హరిబాబు రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సుధాకర్ పట్నాయక్, గర్భాం ఈవో విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రవికుమార్ మృతి

కొత్తవలస, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గొరపల్లి రవికుమార్(50) గురువారం ఆకస్మికంగా మృతి చెందాడు. కొత్తవలస గ్రామంలో నివాసం ఉంటున్న రవికుమార్‌కు ఉదయం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గం మధ్యలోనే కన్నుమూశారు. రవి కుమార్ మృతి పట్ల వైసీపీ, తెలుగుదేశం, బీజేపీ, సీపీఎం, సీపీఐ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

నేడు మండల సమావేశం

వంగర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తమ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామారావు తెలిపారు. ఎంపీపీ సురేష్ ముఖర్జీ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి అధికారులు అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

ఆర్థిక వ్యవస్థపై వాతావరణ ప్రభావం

శృంగవరపుకోట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై వాతావరణ మార్పులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎకనామిక్స్ అధ్యాపకుడు వాసుదేవరావు తెలిపారు. జాతీయ సేవా పథకం యూనిట్-1 ప్రత్యేక సేవా శిబిరంలో గురువారం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఓ భాస్కరరావు, అధ్యాపకులు లక్ష్మి, దివ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజాంలో..

రాజాం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజయ్యపేట గ్రామంలో గురువారం జీసీఎస్ఆర్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం రాగోలులోని జెమ్స్ హాస్పిటల్ సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. 120 మందిని పరీక్షించి.. ఉచితంగా మందులు సరఫరా చేశారు, ఈ కార్యక్రమంలో పీవో తురంగి విశ్వనాథం, సర్పంచ్ రగుమండల గణపతిరావు నాయుడు పాల్గొన్నారు,

అక్రమ కట్టడాల తొలగింపు

కొత్తవలస, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి.. చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్నట్టు కొత్తవలస ఇన్‌చార్జి తహసీల్దార్ పి.సునీత తెలిపారు. చింతలపాలెం గ్రామ రెవెన్యూలోని సర్వేనెంబరు 300లో అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని, కొత్తవలసలోని వివిధ ప్రాంతాలలోను తొలగింపులు చేస్తున్నట్టు తెలిపారు. ఇటీవల కొత్తవలస తహసీల్దార్‌గా పని చేసి సస్పెండైన పి.అప్పలరాజు హయాంలో ప్రభుత్వ భూములలో అక్రమ నిర్మాణాలు వెలసినట్టు జిల్లా అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తొలగింపులు చేస్తున్నట్టు తహసీల్దార్ తెలిపారు.

కూటమితో అభివృద్ధి

దత్తిరాజేరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని మండల టీడీపీ అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్ అన్నారు. పప్పల లింగాలవలస, వీరసాగరం గ్రామాల మధ్య రూ.1.20 కోట్లతో తారు రోడ్డు నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు బోడసింగి సత్తిబాబు, క్లష్టర్ ఇన్‌చార్జ్ మిత్తిరెడ్డి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చెల్లూరి సత్యరావు, నాయకులు మార్పిన ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

ఇది మడ్డువలస రిజర్వాయరే


మడ్డువలసలో పేరుకుపోయిన పిట్టతామర

వంగర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మడ్డువలస రిజర్వాయర్‌లో పిట్టతామర పేరుకుపోవడంతో నీరు కలుషితమవుతోంది. పిట్టతామర పెరగడం వల్ల జలగలు వృద్ధి చెందుతున్నాయి. ఈ గడ్డిని పశువులు తినడం వల్ల అవి అనారోగ్యం పాలవుతున్నాయి. ఇటీవల మడ్డువలస వచ్చిన కలెక్టర్ రామసుందరరెడ్డి వెంటనే పిట్టతామర తొలగించడానికి అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కానీ అది కార్యరూపం దాల్చలేదు. సంబంధిత అధికారులు స్పందించి..రిజర్వాయర్‌లో పిట్టతామర తొలగింపునకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

తంగుడుబిల్లి భూ సమస్యలను పరిష్కరించండి


మంత్రి అనితకు సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి, రైతులు

నెల్లిమర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగుడుబిల్లి రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితకు ఎమ్మెల్యే లోకం నాగమాధవి విజ్ఞప్తి చేశారు. విజయనగరం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆ గ్రామ రైతులతో కలిసి మంత్రి అనితను కలిశారు. రైతుల సమస్యలను వివరించారు. అక్కడే ఉన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు, కలెక్టర్ రామసుందర్‌రెడ్డిలకు కూడా సమస్యను వివరించారు. సుమారు 150 రైతు కుటుంబాలకు సంబంధించిన భూమికి సరైన రెవెన్యూ రికార్డులు లేకపోవడంతో వారికి వారసత్వ బదిలీ జరగడం లేదని ఎమ్మెల్యే నాగమాధవి మంత్రికి వివరించారు. దీని వల్ల రైతులు ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతుల ఆవేదనను విన్న మంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి ఈ విషయంపై సానుకూలంగా స్పందించారు. వెంటనే సమగ్ర దర్యాప్తు చేపట్టి రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని తెలిపారు.

సీసీఎల్ఏ కమిషనర్ దృష్టికి భూ సమస్యలు

లక్కవరపుకోట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని భూసమస్యలను గురువారం రాష్ట్ర సీసీఎల్ఏ కమిషనర్ జయలక్ష్మి దృష్టికి ఎమ్మెల్యే లలితకుమారి తీసుకువెళ్లారు. దాసులపాలెం గ్రామంలో సుమారు 60 మంది రైతులు కొన్నేళ్లుగా సాగు చేస్తున్న భూములకు హక్కులు లభించలేదని తెలిపారు. సుమారు 31 ఎకరాల్లో హెల్డోవర్ భూమిగా రెవెన్యూ రికార్డులలో నమోదైందని తెలిపారు. గత అసెంబ్లీ సమావేశాల్లో రెవెన్యూ శాఖ మంత్రి దృష్టికి తెచ్చా మని తెలిపారు. జిల్లాలో చాలా మంది రైతులు ఇలాగే ఉన్నారని తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదు


సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య తెలిపారు. గురువారం నగరంలోని 29వ డివిజన్ మహాలక్ష్మీ నగర్ లేఅవుట్‌లో అనధికార నిర్మాణాన్ని తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్రమ కట్టడాలను ఉపేక్షించ టబోమన్నారు. ఈ విషయమై పట్టణ ప్రజలకు అనేకసార్లు అవగాహన కల్పించినట్టు చెప్పారు. నగరంలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టారు. ఏక్కడైనా పారిశుధ్య పనులు చేపట్టక పోయినా.. సిబ్బంది విధులకు సరిగా హాజరు కాకపోయినా తనకు నేరుగా తెలియజేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన బలోపేతానికి కృషి చేయండి


మాట్లాడుతున్న పడాల అరుణ

దత్తిరాజేరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయి నుంచి జనసేన పార్టీ బలోపేతానికి కార్యకర్తలంతా కృషి చేయాలని మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యురాలు పడాల అరుణ పిలుపునిచ్చారు. గురువారం గర్భాం రోడ్డు జంక్షన్‌లోని కల్యాణ మండపంలో జనసేన నాయకుల ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా పడాల అరుణ మాట్లాడుతూ పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు క్షేత్రస్థాయిలో కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయాలను ప్రజలకు తెలపాలని సూచించారు. గ్రామ, మండల, జిల్లా స్థాయి నాయకులు సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యకలాపాలను ప్రజలకు చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం మండల అధ్యక్షుడు మునకాల జగన్నాథరావు, మామిడి ప్రసాద్, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

ఎక్కువ కేసుల రాజీకి సహకరించండి


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి హరిబాబు

రాజాం రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న జరుగనున్న లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసుల రాజీకి సహకరించాలని శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ న్యాయాధికారి కె.హరిబాబు న్యాయవాదులను కోరారు. స్థానిక కోర్టు ఆవరణలో గురువారం న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ చేసుకునేలా కక్షిదారుల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో రాజాం మండల న్యాయసేవాధికార అధ్యక్షులు, సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.శారదాంబ, రాజాం సివిల్ న్యాయాధికారి నైమిష, బార్ అసోసియేషన్ ప్రతినిధి శెట్టి పోలారావు, బి.దామోదరరావు, సి.పకీరునాయుడు, కె.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో...

స్థానిక కొండంపేటలో ఉన్న వృద్ధాశ్రమాన్ని శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ న్యాయాధికారి కె.హరిబాబు గురువారం సందర్శించారు. వృద్ధుల సమస్యలను, వారికి అందుతున్న వైద్య సదుపాయాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.శారదాంబ, ఎస్.పోలారావు, ఏజీపీ ఆశ్రమం డైరెక్టర్ శ్రీనివాసరావు, వృద్ధాశ్రమం సిబ్బంది పాల్గొన్నారు.

సైనిక పాఠశాలలో నావికాదళ దినోత్సవం


కేక్ కట్ చేస్తున్న సైనిక పాఠశాల సిబ్బంది

విజయనగరం రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విజయనగరం మండలం కోరుకొండ సైనిక పాఠశాలలో గురువారం నావికాదళ దినోత్సవాన్ని ఉత్సాహ భరితంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్, వింగ్ కమాండర్ కిరణ్ వి, అడ్మినిస్ట్రేషన్ అధికారి స్క్వాడరన్ లీడర్ అథుల్ జాన్ థామస్ హాజరై ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నావికాదళానికి సంబంధించిన వివిధ స్ఫూర్తిదాయకమైన వీడియోలను ప్రదర్శించారు. ఎన్‌సీసీ విద్యార్థులకు నావికాదళ ఆవశ్యకతను వివరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. విద్యార్థులు పాల్గొన్నారు.

పెన్నాంట్ టెక్నాలజీస్‌తో ఎంవీజీఆర్ ఎంవోయూ


ఒప్పంద పత్రాలను చూపిస్తున్న ఇరు సంస్థల ప్రతినిధులు

డెంకాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉపాధి సామర్థ్యాన్ని పెంపొందించడానికి పెన్నాంట్ టెక్నాలజీస్‌తో ఎంవీజీఆర్ కళాశాల అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు గురువారం ఇరు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో పెన్నాంట్ హెడ్ రవివర్మ దాట్ల, ఎంవీజీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, శిక్షణ ప్లేస్‌మెంట్ డీన్ డాక్టర్ ఎం.సునీల్‌ప్రకాష్, ఇతర డీన్లు, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ ఎంవీజీఆర్ కళాశాల, పెన్నాంట్ టెక్నాలజీస్ మధ్య ఏర్పడిన వ్యూహాత్మక భాగస్వామ్యం పరిశోధన, విద్య, ఆవిష్కరణ, అభివృద్ధి, సామర్థ్య నిర్మాణం తదితర వాటిని ముందుకు తీసుకు వెళుతుందని తెలిపారు.

గిరిజనుల భూములనే తీసుకుంటున్నారు


ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

శృంగవరపుకోట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎక్కడ చూసినా దళిత, గిరిజనుల భూములనే తీసుకుంటున్నారని జిందాల్ భూ నిర్వాసితులు మండిపడ్డారు. పరిశ్రమ యాజమాన్యానికి వ్యతిరేకంగా గురువారం బొడ్డవరలో ఆందోళన చేపట్టారు. వ్యవసాయం చేసుకుంటున్న తమ భూములను లాక్కొని పరిశ్రమ స్థాపించకపోవడంతో కూలీలుగా మారామని వాపోయారు. 174 రోజులుగా న్యాయం కోసం పోరాటం చేస్తున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని హెచ్చరించారు.

మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు


రికార్డులను పరిశీలిస్తున్న సీఐ చక్రవర్తి

మెరకముడిదాం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు మద్యం విక్రయి ంచే షాపులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చీపురుపల్లి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ హెచ్.చక్రవర్తి తెలిపారు. గురువారం గర్భాం గ్రామంలో గల మద్యం షాపును సిబ్బందితో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం షాపుల ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే వినియోగదారులకు విక్రయించాలని సిబ్బందికి సూచించారు. బెల్టుషాపులపై ఎప్పటికప్పుడు తమ సిబ్బందితో కలసి దాడులు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయించిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. అనంతరం మద్యంషాపులోని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ జి.గిరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించండి


మాట్లాడుతున్న ఏఎస్పీ సౌమ్యలత

సంతకవిటి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని విజయనగరం జిల్లా అదనపు ఎస్పీ పి.సౌమ్యలత సంతకవిటి ఎస్ఐ ఆర్.గోపాలరావును ఆదేశించారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసుస్టేషన్‌కు వచ్చి నేరుగా ఫిర్యాదు చేసినా, ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చిన వెంటనే స్పందించాలని రాజాం రూరల్ సీఐ, ఎస్ఐలను ఆదేశించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఫిర్యాదు దారులకు రసీదు ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా సంతకవిటి పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలు, పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ, సిబ్బంది పనితీరుపై ఏఎస్పీ సౌమ్యలత ఆరా తీశారు.

ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్- ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాచిపెంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పణుకువలస సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మక్కువ మండలం కవిరిపల్లికి చెందిన అలమండ వినోద్‌కుమార్ (35) మృతి చెందారు. పాచిపెంటకు చెందిన గెద్ద నూకరాజుకు తీవ్ర గాయాల పాలయ్యారు. పోలీసుల వివరాల ప్రకారం.. కవిరిపల్లి గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ అత్తవారు గ్రామమైన పాచిపెంట మండలం చెరుకుపల్లికి మూడేళ్ల కిందట బతుకు తెరువు కోసం వెళ్లిపోయాడు. అయితే వినోద్‌కుమార్ చెరుకుపల్లి నుంచి రామభద్రపురం మండలం కొట్టక్కి వద్ద డీజే దాబాకు పని నిమిత్తం ప్రతీరోజు వెళుతుంటాడు. ప్రతి రోజులాగే గురువారం కూడా కొట్టక్కి దాబాకు చెరుకుపల్లి నుంచి వెళుతుండగా పణుకువలస సమీపంలో గల జాతీయ రహదారి వద్ద సాలూరు నుంచి పాచిపెంట వస్తున్న వ్యాన్.. మోటారు సైకిల్‌ను బలంగా ఢీకొంది. దాంతో వినోద్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. వ్యాను డ్రైవర్ గద్ద నూకరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని సాలూరు సీహెచ్‌సీకి తరలించారు. వినోద్‌కుమార్ మృతదేహానికి శవ పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం సాలూరు పీహెచ్‌సీకి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్థానిక హెచ్‌సీ సమర్పణరావు కేసు నమోదు చేశారు.

ప్రమాదంలో మహిళకు గాయాలు

శృంగవరపుకోట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు చక్రాల కింద మహిళ పాదం నలిగింది. గురువారం విశాఖపట్నం నుంచి ఆర్టీసీ బస్సు శృంగవరపుకోట ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి వస్తోంది. అదే సమయంలో కాపుసోంపురం గ్రామానికి చెందిన డి.కాంతమ్మ ముందుకు వెళుతోంది. దీంతో ఆర్టీసీ బస్సు చక్రం ఆమె ఎడమ కాలిపైకి ఎక్కింది. తీవ్ర గాయం కావడంతో ఆర్టీసీ సిబ్బంది స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి ఆమెను తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం విజయనగరం మహారాజా ఆసుపత్రికి తరలించారు.

మొక్కజొన్న రైతులకు వ్యాపారి టోకరా

మక్కువ (సాలూరు రూరల్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేసిన వ్యాపారి డబ్బులివ్వకుండా తిరిగి రైతులకే కోర్టు నుంచి నోటీసులు పంపించిన ఘటన సాలూరు మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు వివరాలు ఇలా ఉన్నాయి. సాలూరు మండలం నెలిపర్తి గ్రామానికి చెందిన 16 మంది రైతులు నాలుగు నెలల కిందట తూర్పుగోదావరి జిల్లా అనపర్తి గ్రామానికి చెందిన వ్యాపారి పులగం వీరవెంకటరెడ్డికి మొక్కజొన్న పంటను అరువు పద్ధతిలో విక్రయించారు. సదరు వ్యాపారి రైతులతో కలసి నమ్మకంగా ఉండటంతో 16 మంది రైతులు తాము పండించిన మొక్కజొన్న పంటను ఆయన విక్రయించారు. నెలలు గడుస్తున్నా రైతులకు డబ్బులు చెల్లించక పోవడంతో రైతులు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి ఫిర్యాదు చేశారు. రైతుల సమస్యను తెలుసుకున్న మంత్రి.. రైతుల సమస్యను పరిష్కరించాలని సాలూరు రూరల్ పోలీసులను ఆదేశించారు. రైతుల ఫిర్యాదు మేరకు సాలూరు రూరల్ ఎస్ఐ నరసింహమూర్తి.. పులగం వీరవెంకటరెడ్డిపై కేసు నమోదుచేసి నవంబరు 24న ఎఫ్ఐఆర్ వేశారు. అయితే నిందితుడు పరారీలో ఉండటంతో కేసు విచారణలో ఉంది. ఇదిలా వుండగా నెలిపర్తి గ్రామానికి చెందిన మొక్కజొన్న రైతులకు సుమారు రూ.17 లక్షలు చెల్లించాల్సిన వీరవెంకటరెడ్డి రైతులకు కోర్టు నోటీసులు పంపించారు. తాను ఐపీ పెట్టానంటూ నోటీసుల్లో పేర్కొన్నారు. దాంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఈ విషయం ఎస్ఐ నరసింహమూర్తి వద్ద ప్రస్తావించగా కేసు విచారణలో ఉందన్నారు. వీరవెంకటరెడ్డి ప్రావిన్సియల్ ఇన్‌సాల్వెన్స్ చట్టం క్రింద బొబ్బిలి కోర్టులో కేసు వేశారని తెలిపారు. తన వద్ద ఉన్నంత వరకే రైతులకు చెల్లించేందుకు కోర్టు అనుమతిని కోరుతూ పిటీషన్ పెట్టుకున్నాడని తెలిపారు.

135 లీటర్ల సారా స్వాధీనం

పార్వతీపురం టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.ఆర్.నగరం సమీపంలో నిర్వహించిన దాడుల్లో 135 లీటర్ల సారాతో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శిరీష తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈఎస్‌టీఎఫ్ బృందం, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించామన్నారు. ముందస్తు సమాచారం మేరకు ఎం.ఆర్.నగరం సమీపంలో దాడులు నిర్వహించామన్నారు. సారాతో పాటు అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ దాడుల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐ ఆర్.చంద్రకాంత్, ఈఎస్‌టీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

పార్వతీపురం రూరల్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): వెంకంపేటలోని జలుమూరు జనార్దనకు చెందిన ఇంటిలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయింది. దాంతో ఇంటిలోని సామగ్రి దగ్ధమయ్యాయి. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఘటన జరిగింది. దాంతో సామగ్రి కాలిపోయింది. బాధితుడు జనార్తన కన్నీరుమున్నీరయ్యారు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. గ్రామ పెద్దలు జాగాన రవిశంకర్ తదితరులు వెళ్లి వారిని ఓదార్చారు. ఎమ్మెల్యే విజయచంద్ర దృష్టికి తీసుకొని వెళతామని హామీ ఇచ్చారు. రూరల్ పోలీసులు ఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు.

అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్ల కొట్లాట

సాలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గొట్టాపు వీధి అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన కార్యకర్త జె.అరుణ, సహాయకురాలు టి.ఝాన్సీ మధ్య నెలకొన్న వివాదం గురువారం కొట్లాటకు దారితీసింది. దీనికి సంబంధించి సీడీపీవో మంగమ్మ తెలిపిన వివరాలివీ... గొట్టాపు వీధి అంగన్‌వాడీ కేంద్రంలోని కార్యకర్త అరుణ, సహాయకురాలు ఝాన్సీల మధ్య కొద్దిరోజులుగా వివాదం నడుస్తోందని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో నెల రోజుల కిందటే ఇద్దరికీ మెమోలు ఇచ్చామన్నారు. గురువారం మళ్లీ ఇద్దరి మధ్య జరిగిన వాగ్వాదం కొట్లాటకు దారి తీసిందని తెలిపారు. దీంతో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఇద్దరూ ఫిర్యాదు చేశారని వివరించారు. కొట్లాటలో ఝాన్సీ భర్త శ్యామ్ కంటిపై స్వల్ప గాయమైందని, వైద్యం కోసం ఆసుపత్రికి తరలించినట్టు తెలిసిందని సీడీపీవో చెప్పారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన కోండ్రు


మంత్రి నారా లోకేశ్‌తో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

రాజాం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా పర్యటనలో భాగంగా విశాఖ విమానాశ్రయానికి గురువారం చేరుకున్న మంత్రి నారా లోకేష్‌ను స్థానిక ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కలుసుకున్నారు. రాజాం నియోజకవర్గంలోని వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. రాజాం మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ నియోజకవర్గం అభివృద్ధి తన వంతు కృషి చేస్తామన్నారని ఎమ్మెల్యే తెలిపారు.

నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు రాక

- భామినిలో నిర్వహించే పీటీఎంకు హాజరు
- పాల్గొననున్న మంత్రి లోకేశ్
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



సిద్ధమైన సభావేదిక

భామిని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం జిల్లాకు రానున్నారు. భామిని మోడల్ స్కూల్‌లో జరగనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం(పీటీఎం)లో ఆయన పాల్గొననున్నారు. సీఎంతో పాటు మంత్రి నారా లోకేశ్, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పాఠశాల ఆవరణ లోనే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశ మయ్యే వేదికను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. స్కూల్‌కు ఎదురుగానే హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖ పట్నం నుంచి నేరుగా హెలికాప్టర్ ద్వారా ఉదయం 10.20 గంటలకు భామిని చేరుకుంటారు. 10.30 గంటలకు ఏపీ మోడల్‌స్కూల్, జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్దకు రోడ్డు మార్గం లో చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటల వరకు మెగా పేరెంట్స్ సమావేశంలో పాల్గొంటారు. పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 7,726 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో బాలురు 328 మంది, బాలికలు 398 హాజరుకానున్నారు. వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా పాల్గొంటారు. ఇందుకు సంబం ధించిన ఏర్పాట్లను గురువారం కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి దగ్గరుండి పూర్తి చేశారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ , డైరెక్టర్ శ్రీనివాస్ పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి కాన్వాయి, హెలికాప్టర్ ల్యాండింగ్‌కు సంబంధించి ట్రయిల్ రన్ నిర్వహించారు. హోలీస్టిక్స్ ప్రో గ్రెస్ కార్డులో భాగంగా విద్యార్థులతో కలెక్టర్ లీప్ (సైగలు)ను ప్రాక్టికల్‌గా నిర్వహించారు. గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. దారి పొడవునా బాంబు స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ మాధవ రెడ్డి, పాలకొండ సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ పాల్గొన్నారు.

మూడో ముఖ్యమంత్రిగా..

భామిని మండలంలో అడుగుపెట్టనున్న మూడో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నిలవనున్నారు. 1962లో నేరడి బ్యారేజీ శంకుస్థాపనకు అప్పటి సీఎం దామోదరం సంజీవయ్య హాజరయ్యారు. 1980లో వంశ దారకు వచ్చిన వరదలకు తాలాడ గ్రామంలో అత్యధికమంది మృతి చెందడంతో బాధితులను పరామర్శించేందుకు ఆనాటి సీఎం అంజ య్య వచ్చారు. 1996లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు నేరడి బ్యారేజ్ శంకుస్థాపనకు హాజరుకావాల్సి ఉండగా ఆ కార్యక్రమం ఆకస్మి టకంగా రద్దయింది. ఆయన హిరమండలంలో శంకుస్థాపన చేశారు.

● వైసీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబునాయుడు అరెస్టును తట్టుకోలేక భామిని మండ లంలోని బిల్లుమడకు చెందిన ఓవ్యక్తి గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఈ బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి బిల్లుమడకు వచ్చారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చంద్రబాబు నాయుడు ఈ ప్రాంతంలో పర్యటిస్తారని అప్పట్లో భువనేశ్వరి అన్నారు. ఆ మేరకే మారుమూల మండలం ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతం భామినికి ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తున్నారని, మాటకు కట్టుబడిన కుటుంబమని టీడీపీ శ్రేణులు సంతోషపడుతున్నాయి.

మా మొర వినరూ!



అర్ధాంతరంగా నిలిచిన కొండలోయగెడ్డ రిజర్వాయర్

భామిని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం భామిని వస్తుండడంతో తమ సమస్యలు పరిష్కారమవు తాయని, కొత్త వరాలు కురిపిస్తారని మండల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వంశధార నదీ తీర ప్రాంతంలో కరకట్టలు లేకపోవడంతో వరదలకు భూములు కోతకు గురై నదీ గర్భంలో కలుస్తున్నాయి. ఈ సమస్యను పరిష్కరించాలని కోసలి, కీసర, తాలాడ, సింగిడి, లివిర తదితర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. భామిని ఎగువన తివ్వకొండలను కలుపుకొని చేపడు తున్న కొండలోయగెడ్డ రిజర్వాయర్ పనులు అర్ధాంతరంగా నిలిచిపో యాయి. ఈ పనులకు 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులను నిర్లక్ష్యం చేసింది. ఈ ప్రభుత్వంలోనైనా రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు. భామినిలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో చాలా మంది విద్యార్థులు ఇంటర్‌తో చదువుకు ఫుల్‌స్టాప్ పెడుతున్నారు. డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో ఏళ్ల తరబడి నాలుగు ఏనుగులు మండలంలో తిష్టవేశాయి. దీంతో రైతులు తీ వ్రంగా నష్టపోతున్నారు. ఏనుగులను సురక్షిత ప్రాంతానికి తరలించాలని విన్నవిస్తున్నారు. ప్రతిపక్ష నేతగా చంద్రబాబునాయుడు కొత్తూరు మండలంలో నిర్వహించిన బహిరంగ సభలో ఇచ్చిన హామీ మేరకు భామిని మండలాన్ని తిరిగి శ్రీకాకుళం జిల్లాలో చేర్చాలని వేడుకుంటున్నారు.

గ్రూపులు వద్దు.. కలిసికట్టుగా పనిచేయండి

(ఐదో పేజీ తరువాయి)

కార్యక్రమాల్లో పాల్గొంటున్నాం. కరుడుగట్టిన కార్యకర్తలే నాకు స్ఫూర్తి. రాష్ట్ర చరిత్రలోనే కనివిని ఎరుగని రీతిలో 94శాతం అసెంబ్లీ సీట్లు సాధించడం వెనుక ప్రతీ ఒక్క కార్యకర్త కష్టం దాగి ఉంది. చంద్రబాబును 53 రోజులు అన్యాయంగా జైల్లో పెడితే అండగా నిలబడి పోరాడింది టీడీపీ కార్యకర్తలే. అధికారం చేపట్టిన 18నెలల్లోనే భోగాపురం ఎయిర్‌పోర్టు, గూగుల్, హర్షలరీ మిట్టల్ వంటి ఎన్నో భారీ ప్రాజెక్టులు తెచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుంది. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తున్నాం. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకొనే విధంగా సుపరిపాలన అందిస్తున్నాం. చేసిన అభివృద్ధిని కార్యకర్తలు ప్రజలకు వివరించాలి. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ తరలిపోకుండా రక్షించుకున్నాం. రైల్వేజోన్‌ను సాధించాం. రప్పారప్పా అని జగన్ అంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడే ఏమి చేయలేని జగన్ ఇప్పుడు ఏం చేస్తారు. టీడీపీ కార్యకర్తలు ప్రభుత్వ కార్యాలయాలకు పనులపై వెళితే అధికారులు గౌరవం ఇవ్వాలి. దీనికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు, జిల్లా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి బాధ్యత తీసుకోవాలి. పార్టీ బాగుంటేనే కార్యకర్తలు బాగుంటారు' అని అన్నారు. లోకేశ్‌కు జిల్లా మంత్రి సంధ్యారాణి, ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు, విప్ జగదీశ్వరీ, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, టీడీపీ బాధ్యులు పడాల భూదేవి స్వాగతం పలికారు.దీనికి ముందు లోకేశ్‌ను కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి, జేసీ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ పవార్‌స్వప్నిల్ జగన్నాథ్ కలిశారు. కార్యక్రమంలో టీడీపీ అరకు పార్లమెంట్ అధ్యక్షుడు, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్, ఉత్తరాంధ్ర సమన్వయకర్త దామచర్ల సత్య, శాప్ చైర్మన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులతో రాజకీయాలు తగదు

● మంత్రి సంధ్యారాణి



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

పాలకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలు కోసం గిరిజనులను ఉపయోగించు కోవడం వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి తగదని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. గురువారం ఆమె పాల కొండలో విలేకరులతో మాట్లాడారు. తనపై జగన్ విమర్శలు చేయడం శోచనీయమన్నారు. 2023లో వైసీపీ ప్రభుత్వంలో 66 మంది వివిధ కారణాలు వల్ల చనిపోతే జగన్ పరామర్శించ లేదన్నారు. వారి కుటుంబాలను ఆదుకోలేదని మంత్రి గుర్తుచేశారు. గిరిజనులు అంటే జగన్ రెడ్డికి అలుసన్నారు. ఇద్దరు గిరిజన శాఖ మం త్రులు వైసీపీ ప్రభుత్వంలో పనిచేశారన్నారు. కనీసం చనిపోయిన కుటుంబాలకు వారు ఓదార్చలేదన్నారు. దురదృష్టవశాత్తు కొంతమంది విద్యార్థులు అనారోగ్యం కారణంగా చనిపోయా రని, దానికి ప్రభుత్వం చింతిచిందన్నారు. అనా రోగ్యంతో ఉన్న విద్యార్థులకు కేజీహెచ్ వరకు తీసుకెళ్లి వారిని ఆరోగ్యవంతంగా ఉండేలా చూశామన్నారు. తనపై, తన కుటుంబంపై ఇష్టమొచ్చినట్టు సమావేశాలు పెట్టి మాట్లా డటం తగదన్నారు. చిన్నాన్న హత్యలో హస్తం ఎవరిది ఉందో, తల్లి, చెల్లిని బయ టకు పంపించిన జగన్‌రెడ్డి కోసం రా ప్రజలకు తెలుసన్నారు. ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని చెబుతున్నారని, ప్రజలే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని తెలుసుకోలేక పోవడం శోచనీయమన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, టీడీపీ నేతలు కర్నేన అప్పలనాయుడు, గంటా సంతోష్‌కుమార్ తదితరులున్నారు.

రైతులను ఇబ్బంది పెడితే సహించం

సాలూరు, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టేలా చర్యలకు పాల్పడితే సహించేది లేదని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మిల్లర్లను హెచ్చరించారు. గురువా రం పట్టణంలోని నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైస్ మిల్లర్లకు చేరిన ధాన్యాన్ని గ్రేడ్, తేమ, నాసిరకం పేరిట 10 నుంచి 20 కేజీలు అదనంగా తీసుకోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ధాన్యం మిల్లర్లకు చేరిన తక్షణమే హమాలీల పేరుతో రైతుల నుంచి ప్రతి చిన్న బస్తాకు రూ. 5 నుంచి 10 వరకు వసూలు చేయడం సరికాదన్నారు. అలాగే రైతుల వద్ద నుంచి సేకరించిన ధాన్యాన్ని లారీల ద్వారా మిల్లుకు చేరిన వెంటనే రైతుల నుంచి తక్షణమే అద్దె వసూలు చేయడం, సొంత కాటా వ్యత్యాసాలు ఉండడంతో రైతులు నష్టపోతున్నార న్నారు. రైతులను ఇబ్బందిపెట్టే మిల్లర్లపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సమా వేశంలో మక్కువ మండల అధ్యక్షుడు గుళ్ల వేణుగోపాలనాయుడు, పరమేశ్, యుగంధర్, ఉమా, హర్షవర్ధన్‌తో పాటు ఏఎంసీ చైర్మన్ ముఖీ సూర్యనారాయణ తదితరులున్నారు.

సీఎం సారూ..ఆశలన్నీ మీపైనే!

(5వ పేజీ తరువాయి)

మార్గం చూపుతారని మన్యం వాసులు భావిస్తున్నారు.

పేరుకే మన్యం జిల్లా..

గత వైసీపీ ప్రభుత్వం ఎంతో హడావుడిగా జిల్లాలను ఏర్పాటు చేసింది. మౌలిక వసతులు, కార్యాలయాలపై మాత్రం దృష్టి సారించలేదు. దీంతో పార్వతీపురం మన్యం జిల్లా పేరుకే అన్న చందంగా మారింది. జిల్లాగా ఏర్పడి సుమారు నాలుగేళ్లు గడుస్తున్నా.. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు లేవు. పూర్తిస్థాయి అధికారులు లేరు. ఇప్పటికీ ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. గతంలో కలెక్టరేట్ నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు తప్ప పనులు ప్రారంభించ లేదు. జిల్లాలో సుమారు 50 ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి శాఖకు పూర్తిస్థాయి అధికారితో పాటు కార్యాల యాలకు పక్కా భవనాలు ఏర్పాటు చేపట్టాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది.

ఐటీడీఏలు ఇలా..

పార్వతీపురం, సీతంపేటలో ఉన్న ఐటీడీఏలను గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. వాటి ద్వారా గిరిజనులకు సబ్సిడీపై రుణాలు, వ్యవసాయ పరికరాలు , వాహనాలు అందించని పరిస్థితి. వైటీసీలపైనా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దీంతో గిరిజన యువతకు ఉపాధి అవకా శాలకు దూరమయ్యారు. కూటమి ప్రభుత్వం ఐటీడీఏలపై దృష్టి సారించి.. వాటికి పూర్వ వైభవం తీసుకురావల్సి ఉంది.

డోలీ మోతలు తప్పేనా?

గిరి శిఖర గ్రామస్థులకు డోలీ మోతలు తప్పడం లేదు. అత్యవసర వేళల్లో వైద్య సేవలు పొందేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. రాళ్లు, రప్పలు దాటి.. కొండలు దిగి ఆసుపత్రులకు వెళ్లే లోపు ఎంతోమంది మృత్యువాతపడుతున్నారు. గిరిజన ప్రాంతవాసులకు నేటికీ రహదారుల సమస్య వెంటాడుతుంది. గత వైసీపీ ప్రభుత్వం గిరిజన గ్రామాలపై దృష్టిసారించలేదు. రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాలు ఊపందుకున్నాయి. అయితే ఇంకా మరికొన్ని గ్రామాల్లో రోడ్ల పనులు చేపట్టాల్సి ఉంది. ఇదిలా ఉండగా కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు రహదారుల నిర్మాణాలకు ఆటంకంగా మారింది. ఒక రహదారికి రూ.50 లక్షలకు మించి ఖర్చు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న రోడ్లు పనులకు సంబంధించి ఈ నిబంధనలను సవరించాల్సిన అవసరం ఉంది. ప్రతి గిరిజన గ్రామనికి అంబులెన్స్ వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

సాగునీటి ప్రాజెక్టులు ఇలా..

● జంఝావతి ప్రాజెక్టు ద్వారా 24 వేల ఎకరాలకు నీరందించాల్సి ఉన్నప్పటికీ కనీసం 8 వేలకు ఎకరాలకు కూడా సాగునీరు అందం లేదు. ఒడిశాతో నెలకొన్న వివాదాలు కొలిక్కి రాకపోవడమే ఇందుకు కారణం. దీనిపై ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మేరకు ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు ఈ సమస్యను త్వరగా పరిష్కరించాల్సి ఉంది.

● తోటపల్లి ప్రాజెక్టు ద్వారా పాత ఆయకట్టు పరిధిలోని ఎడమ కాలువ ఆధునికీకరణ, ఇతర పనులను పూర్తి చేయాల్సి ఉంది. కొత్త ఆయకట్టు ద్వారా పార్వతీపురం తదితర ప్రాంతాలకు సాగునీరు అందించాలి. తోటపల్లి ప్రాజెక్టు ద్వారా లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపట్టి గరుగుబిల్లి, జియ్యమ్మవలస తదితర మండలాలకు నీరందించాలని గత టీడీపీ ప్రభుత్వ కాలంలోనే ఆదేశాలు వచ్చాయి. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ జీవోలను రద్దు చేసింది. ఈ నేపథ్యంలో లిఫ్ట్ ఇరిగేషన్‌పై కూటమి దృష్టి సారించాల్సి ఉంది.

● వెంగళరాయ సాగర్, పెద్దగెడ్డ తదితర ప్రాజెక్టుల ఆధునికీకరణ పనులు జైకా నిధులతో ప్రారంభమై మధ్యలో నిలిచిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడమే ఇందుకు కారణం. ఆ ప్రాజెక్టుల ఆధునికీకరణతో పాటు అడారుగెడ్డ రిజర్వాయర్ నిర్మాణానికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

ఆసుపత్రుల పరిస్థితి ఇదీ..

జిల్లా కేంద్రాసుపత్రిలో గుండె, ఇతర వైద్య నిపుణుల పోస్టుల మంజూరు కావడం లేదు. ఇక్కడ రేడియాలజిస్ట్ కూడా లేరు. దీంతో స్కానింగ్ అవసరమైన రోగులతో పాటు గర్భిణులకు ఇబ్బందులు తప్పడం లేదు. పార్వతీపురంతోపాటు సీతంపేట, సాలూరు, పాలకొండ ఏరియా ఆసుపత్రుల్లో స్టాఫ్‌నర్సుతో పాటు ఇతర వైద్యసిబ్బందిని నియమించాల్సి ఉంది. ఇక పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో రోగులకు దంత వైద్య సేవలు అందడం లేదు. పార్వతీపురం, సీతంపేటలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలి. పీహెచ్‌సీల్లో రోగులకు 24 గంటలు వైద్యం అందేలా వైద్యులు, వైద్య సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించాల్సిన అవసరం ఉంది.

వైద్య కళాశాల నిర్మాణం ఎప్పుడు..?

జిల్లాలో వైద్య కళాశాల నిర్మాణం ఎప్పుడు జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు స్థల పరిశీలనకే పరిమితమయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పీపీపీ పద్ధతిలో వైద్య కళాశాల నిర్మాణం చేపడతామని ప్రకటించిన నేపథ్యంలో పనులను వేగవంతం చేయాల్సి ఉంది. జిల్లా ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వీడని ఏనుగుల బెడద

జిల్లా ప్రజలకు ఏనుగుల బెడద వీడడం లేదు. గజరాజుల కారణంగా వందలాది ఎకరాల్లో పంటలు ధ్వంసం కాగా.. అనేక మంది మృత్యువాత పడ్డారు. ఆస్తి నష్టం కూడా సంభవించగా.. తరచూ ఏనుగులు రోడ్లపై సంచరిస్తూ..ప్రజలు, వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. దీర్ఘకాలికంగా ఈ సమస్య వేధిస్తున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు. ఏనుగులను తరలించేందుకు కుంకిని తీసుకొస్తామని కూటమి ప్రభుత్వ పెద్దలు ప్రకటించిన నేపథ్యంలో దీనిపై కీలక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

సాగని పూర్ణపాడు-లాబేసు వంతెన పనులు

నిధులు మంజూరైనా.. కొమరాడ మండలంలో పూర్ణపాడు-లాబేసు వంతెన పనులు కొనసాగడం లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే 80 శాతం నిర్మాణం పూర్తయింది. ఆ తర్వాత అధికారంలోకి వైసీపీ .. దానిపై దృష్టి సారించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారులు ఈ వంతెన నిర్మాణం పూర్తికి టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదు.

అప్‌గ్రేడ్ చేస్తే మంచిది..

ప్రస్తుతం టెన్త్ పాసైన విద్యార్థులకు గురుకుల కళాశాలలో సీట్లు దొరకడం లేదు. దీంతో చాలామంది గిరిజన విద్యార్థులు ఇంటర్ , ఆపై చదువులకు దూరమవుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రెండు ఐటీడీఏల పరిధిలో కొన్ని ఆశ్రమ పాఠశాలలను అప్ గ్రేడింగ్ చేసి ఇంటర్ విద్యను ప్రారంభించాల్సి ఉంది. దీనివల్ల గిరిజన విద్యార్థులు స్థానికంగానే ఇంటర్ చదువుకునే వీలు కలుగుతుంది.

పారిశ్రామికంగా అభివృద్ధి ఏదీ?

పార్వతీపురం మన్యం జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందడం లేదు. కనీసం పది మందికి ఉపాధి కల్పించే ఒక చిన్న పరిశ్రమ కూడా జిల్లాలో లేదు. మరోవైపు జిల్లాలో ఉన్న రైస్‌మిల్లులు బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వలేక సీఎంఆర్ ఆపరేషన్‌కు దూరంగా ఉన్నాయి. మిల్లులకు బకాయిలు చెల్లించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో పరిశ్రమల ఏర్పాటు.. మరోవైపు రైస్‌మిల్లులు మూతపడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

మరికొన్ని సమస్యలు..

●గత ఐదేళ్ల కిందట గిరిజనులకు ఇచ్చిన దోమ తెరలు పూర్తిగా పాడైపోయాయి. కొత్తవాటికి అధికారులు ప్రతిపాదనలు పంపినా.. కేంద్ర ప్రభుత్వం నుంచి జిల్లాకు దోమతెరలు మంజూరు కావడం లేదు. దీంతో మలేరియా ప్రభావితప్రాంతాల్లో మళ్లీ కేసులు పెరుగుతున్నాయి.

● సాలూరు పార్వతీపురం, పాలకొండ, కరుపాం కేంద్రాలుగా మహిళల కోసం డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాల్సి ఉంది. వీరఘట్టంలో డిగ్రీ కళాశాలకు భవనాలు నిర్మించాల్సి ఉంది.

● జిల్లా కేంద్రం పార్వతీపురం పట్టణానికి బైపాస్ రహదారి నిర్మాణం ఎంతో అవసరమని గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే గుర్తిం చారు. అప్పట్లోనే సర్వే కూడా నిర్వహించారు. అయితే ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ ప్రతిపాదనలు అటకెక్కాయి. ప్రస్తుతం పార్వతీపురంలో ట్రాఫిక్ సమస్య జటిలమైన నేపథ్యంలో బైపాస్ రహదారి నిర్మాణంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది.

● పార్వతీపురం పట్టణంలో ప్రజలు అన్ని కాలాల్లో తాగునీటి సమస్య ను ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో బురద నీరే గతి. వేసవికాలంలో వారం లేదా నాలుగు రోజులు, శీతాకాలంలో రెండు, మూడు రోజులకొక సారి కొళాయిల నీరు సరఫరా అవుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గిరిజన, మైదాన ప్రాంతాల్లో తాగునీటి సమస్య నెలకొంది.

● జిల్లాలో ఏర్పాటు చేసిన గిరిజన గర్భిణుల వసతిగృహాల్లో సేవలం దిస్తున్న సిబ్బందికి సకాలంలో జీతాలు అందడం లేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐటీడీఏల ద్వారా జీతాలు చెల్లించేందుకు నిధులు లేవని అధికారులు చెబుతున్నారు.

సమస్యలను పరిష్కరించండి

పార్వతీపురం టౌన్, డిసెంబరు4 (ఆంధ్ర జ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు జి.వి.రమణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల సమస్యలు పరిష్కరించా లంటూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నిరసన చేపట్టిం ది. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ అమలుతో కార్మికుల జీతాలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. గత జూలైలో రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు 17 రోజుల సమ్మె చేయడం చేశారని, సమ్మె కాలానికి జీతాలు చెల్లిస్తామని అప్పట్లో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చరన్నారు. అయితే దానికి సంబం ధించిన జీవోను జారీచేయాలన్నారు. ఎన్ఎం ఆర్ కార్మికులకు ఏడేళ్లుగా జీతాలు పెంచకపోవడం వారి జీవనం దుర్భరంగా ఉందన్నారు. ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికు లకు సంక్షేమ పథకాలు అమలు చేయాల న్నారు. అనంతరం కమిషనర్ కె.కిశోర్ కుమార్‌కు వినతపత్రాన్ని అందజేశారు.

కాలువల ఆధునికీకరణకు నిధులు కేటాయించాలి

పాలకొండ, డిసెంబరు4 (ఆంధ్ర జ్యోతి): తోటపల్లి కాలువల ఆధునికీక రణ పనులు చేపట్టడానికి ముఖ్య మంత్రి చంద్రబాబు చర్యలు తీసుకో వాలని ఏపీ రైతు సంఘం నేతలు బుడితి అప్పలనాయుడు, చేబోదుల లక్ష్మీనారాయణ, కోరాడ సూరిబాబు కోరారు. గురువారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పర్య టనకు వస్తున్న కాలువల ఆధునికీకర ణకు విషయం స్థానిక కూటమి నాయ కులు, ప్రజా ప్రతినిధులు సీఎం దృష్టికి తీసుకురావాలని విన్నవించారు.

ఐటీడీఏ సమస్యలపై దృష్టి పెట్టండి

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలోని సమస్యలను సీఎం చంద్ర బాబు నాయుడు పరిష్కరించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్ డిమాం డ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం నిర్వ హించిన విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బా లురు, బాలికలు వసతిగృహాల్లో ఉన్న మౌలిక సదుపాయాల సమస్యలు పరిష్కరించాలన్నారు. వసతిగృహాలకు మరమ్మతులు చేయాలన్నారు. ప్రతి ఆశ్రమ పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేయాలన్నారు. వసతి గృహాలకు కుక్, వర్కర్స్ కమాటీ, వాచ్‌మేన్‌లను నియమించాలన్నారు. సీఆర్‌టీలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

పరిష్కారానికి చొరవ చూపాలి

గరుగుబిల్లి, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రధాన సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపా లని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి దృష్టికి నాగూరు ఎంపీటీసీ సభ్యుడు, అరకు టీడీపీ బీసీ విభాగం అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ కోరారు. గురువారం గుమ్మలక్ష్మీపురంలో ప్రభుత్వ విప్‌ను ఆయన కలిసి పలు సమస్యలను వివరించారు. ప్రధాన రహదారి నుంచి చిలకాం రహదారికి నిధులు కేటాయించాలన్నారు. కారివలసలోని పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని, నూతన భవన మంజూరుకు కృషి చేయాలని కోరారు. అలాగే ఎడమ ప్రధాన కాలువ నుంచి రబీకి పూర్తిస్థాయిలో సాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మండలంలోని కొంకడివరం, రావుపల్లి, కొత్తూరు, సన్యాసిరాజుపేట, పెద్దూరు నుంచి టీవీ పురం రహదారులకు మరమ్మతులు చేయించాల న్నారు. అందుకు ప్రభుత్వ విప్ సానుకూలంగా స్పందిం చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకు వెళ్తానన్నారు.

సోలార్ లైట్ల పంపిణీ

కొమరాడ, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): మార్కొండపుట్టి, పరశురాంపురం, కళ్లికోట, విక్రంపురం, రాజ్యలక్ష్మీపురాలో 250 కుటుంబాలకు సోలార్ లైట్లు గురువారం పంపిణీ చేశారు. మార్కొండపుట్టిలో హెల్ప్ సొసైటీ ఆధ్వర్యంలో బ్రిడ్స్ సంస్థ లైట్లను సమకూర్చింది. కారక్రమంలో బ్రిడ్స్ సంస్థ సీఈవో రామకృష్ణరాజు, నాబార్డు డీడీఎం, టీడీపీ నాయకుడే గొట్టాపు త్రినాథం తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌కు ఘన స్వాగతం



అభివాదం చేస్తున్న లోకేశ్

పార్వతీపురం/పాలకొండ/ సీతంపేట రూరల్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): భామిని పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పాలకొండలో ప్రవేశించగానే టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పాలకొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పడాల భూదేవి మం లోకేశ్‌కు హారతి ఇచ్చారు.అరకు పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షుడు పల్లా కొండలరావు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ తదితరులు లోకేశ్‌ను పూలమాలలతో సత్కరించారు. అయితే కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే సీతంపేట మండల కేంద్రంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంత్రికి స్వాగతం పలికారు.

లోకేశ్‌కు స్వాగతం పలికిన కలెక్టర్

●పార్వతీపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ జిల్లాకు వచ్చిన సందర్భంగా కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆయనకు స్వా గతం పలికారు. కలెక్టర్‌తో పాటు జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి తదితర అధికా రులు లోకేశ్‌కు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. భామిని మండలంలో కలెక్టర్‌తో పాటు ఎస్పీ మాధవరెడ్డి, ఇతర అధికారులు స్వాగతం పలికారు.

పార్టీని నమ్మిన వారికి సముచిత స్థానం




మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సీతానగరం, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): పార్టీని నమ్మిన ప్రతి నాయకుడిని, కార్యకర్తను అధిష్టానం గుర్తించి వారికి సముచిత స్థానం కల్పిస్తుందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం మరిపివలస పీఏసీఎస్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చైర్మన్‌గా జక్కు పకీరునాయుడు, డైరెక్టర్లుగా మర్రాపు యోగేశ్వరరావు, శనపతి రాజుపాత్రుడుతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి సీనియర్ నాయకుడికి వివిధ రకాల పదవులు అప్పగిస్తున్నామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సత్యంనాయుడు, వేణుగోపాల్‌నాయుడు పాల్గొన్నారు.

అడ్డాపుశీలలో గిరి ప్రదక్షిణ ప్రారంభం

పార్వతీపురం రూరల్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): అడ్డాపుశీలలోని కాశీ విశ్వేశ్వారాలయం వద్ద గిరి ప్రదక్షణ గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాదాపు 4 కిలోల మీటర్ల గిరి ప్రదక్షణలో పార్వతీపురం ప్రాంతంతో పాటు జీఎంవలస తదితర గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



ఆర్.సి.నెం.190/2015-ఎ1, తేది:04-12-2025

పాలకొండ నగర పంచాయితీ

బహిరంగ వేలం ప్రకటన (Re-Auction)

పాలకొండ నగర పంచాయితీ సంబంధించి ఎలక్ట్రికల్ ఫ్యూజ్ కాల్ ఆఫీసు దగ్గర గల దుఖాన సముదాయములో గల 11 షాపుల్లో షాపు నెం. 1,3,4,5,6 & 7 గల షాపులను మూడు సం.లు కాలమునకు లీజుకు ఇచ్చుటకు గాను తేది: 10-12-2025 నాడు ఉదయం గం.11.00లు నుండి నగర పంచాయితీ కార్యాలయ ఆవరణలో ఈ దిగువ సంతకముదారు సమక్షంలో గానీ లేదా వారి అనుమతి పొందిన అధికారి సమక్షంలో గానీ బహిరంగ వేలం నిర్వహించబడును.

వేలం వివరము	సర్కారు వారి పాటగా నిర్ణయించబడిన మొత్తం	ధరావత్తు
షాపు రూములు (6 నెం.లు)	రూ.2,978/- (షాపు ఒక్కింటికి ప్రారంభ ధర)	రూ.2,900/-

పైన తెలిపిన వివరములు ప్రకారం బహిరంగ వేలం నిర్వహించబడును, వేలంలో పాల్గొనదలచిన వారు తేది: 09-12-2025 సాయంత్రంలోగా రూ. 50,000/-లు విలువకు తక్కువ లేకుండా సాల్వేన్సీ సర్టిఫికేట్ మరియు నోడ్యూస్ సర్టిఫికేట్ సమర్పించవలెను. షాపుల వేలంపాటలో ఖరారుకాబడిన అద్దె రేటు ననుసరించి మూడు నెలలు అద్దెను (18% GST అదనం) డిపాజిట్టుగా చెల్లించవలసియున్నది. నగర పంచాయితీకి బకాయిలు ఉన్నవారు పాటలో పాల్గొనుటకు అనర్హులు, ఇతర వివరములకు కార్యాలయ పనివేళల్లో సంబంధిత విభాగ అధికారులను నేరుగా సంప్రదించి తెలుసుకోవచ్చును.

సం/- కమీషనర్
పాలకొండ నగర పంచాయితీ

